## 108 మందికి పోస్టల్ బ్యాలెట్

మణుగూరు టౌన్/సారపాక, నవంబర్ 19: పినపాక నియోజకవర్గంలో ఇంటి నుంచి ఓటు వేసేందుకు దరఖాస్తు చేసిన వారిలో 108 మందికి పోస్టల్ బ్యాలెట్ ఇచ్చినట్లు పినపాక అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ రాఘవరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల సంఘం సూచనల ప్రకారంగా 80 సంవత్సరాలు పైబడిన వారు, దివ్యాంగుల నుంచి హోం ఓటింగ్‌కు దరఖాస్తులను ఆహ్వానించినట్లు పేర్కొన్నారు. వారి వద్దకు ఈ నెల 22న ఎన్నికల సిబ్బంది వెళ్లి హోం ఓటింగ్ ప్రక్రియ చేపడతారని తెలిపారు.

## ఆర్యవైశ్య వన మహోత్సవం

పాల్వంచ, నవంబర్ 19 : ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పాల్వంచలోని శ్రీనివాస గిరి గుట్ట వద్ద ఉన్న శ్రీవారి పాదల సమీపంలో ఆర్యవైశ్య కార్తీక వనమహోత్సవం నిర్వహించారు. మహిళలు, పురుషులు, పిల్లలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వారికి పలురకాల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకుడు చలువాది ప్రకాష్, సంక రవి, ఆరెంజ్ మెడికల్ శ్రీనివాస్, బచ్చు శ్రీనివాస్, చారుగళ్ల శ్రీనివాసరావు, దారా మల్లికార్జున్‌రావు, కొప్పరపు రాము, చవ్వ సంతోశ్, డోగిపర్తి సతీశ్, గర్రె శివ, చలువాది రాజ్యలక్ష్మి, చిరునోముల బిందు, మంజుల, దీప్తి, కల్యాణి, విమల, మౌనిక, హారిక పాల్గొన్నారు.

## హక్కుల సాధనకు కృషి

పాల్వంచ, నవంబర్ 19 : దూదేకుల హక్కుల సాధనకు కృషి చేయాలని తెలంగాణ రాష్ట్రం ముస్లిం, నూర్‌బాషా(బీసీ) సంక్షేమ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు ఖాసీం పిలుపునిచ్చారు. ఆదివారం ఒడ్డుగూడెంలోని సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అత్యంత వెనుకబడిన, చేతివృత్తులు, దూదేకుల సభ్యుల జీవనోపాధికి అవసరమైన బీసీ రుణాలను, విద్యార్థులకు అవసరమైన ఉపకార వేతనాలను, మహిళలను ప్రోత్సహించే స్వల్ప వడ్డీ రుణాలను మంజూరు చేసి దూదేకుల అభివృద్ధికి చేయూతను అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. మహబూబ్, రంజాన్ బీ, ఖాసీం, మస్తాన్‌వలీ, నాగుల్‌మీరా, సైదులు, రసూల్, జానీమియా, రహీం, మౌలా, సిద్దమీరా, సిలార్ బీ, మీరాబీ, ఫిరాబీ పాల్గొన్నారు.

## సత్యనారాయణ వ్రతం

పాల్వంచ, నవంబర్ 19 : పాల్వంచలోని ఆత్మలింగేశ్వర స్వామి ఆలయంలో సద్గురు ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం సత్యనారాయణ స్వామి వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు వీరభద్రం ఆధ్వర్యంలో సుమారు 500 మంది దంపతులతో వ్రతాన్ని చేయించారు. కార్యక్రమంలో ధర్మకర్త మచ్చా శ్రీనివాసరావు, ఎల్లావుల కోటేశ్వరరావు, రమణ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

దుమ్ముగూడెం, నవంబర్ 19 : రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతిచెందిన ఘటన దుమ్ముగూడెం క్రాస్‌రోడ్డు వద్ద ఆదివారం చోటుచేసుకున్నది. దుమ్ముగూడెం గ్రామానికి చెందిన మల్లుల రామారావు(65) లక్ష్మీనగరంలో సొంత పని నిమిత్తం ద్విచక్రవాహనంపై వెళ్లి తిరిగి పెట్రోల్ బంకుకు వెళ్తుండగా కిష్టారం గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు ద్విచక్రవాహనంపై వస్తూ ఢీకొట్టారు. రామారావు కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన వారిని గ్రామస్తులు పట్టుకొని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



బూర్గంపహాడ్: బిజ్జం శ్రీకాంతరెడ్డికి గులాబీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న మంత్రి కేటీఆర్



పినపాక: అమరారంలో పోడు రైతులతో మాట్లాడుతున్న వట్టం రాంబాబు

# ‘ప్రగతి’ గెలవాలి.. పల్లెలు మెరవాలి.. ప్రజలు మురవాలి



కరకగూడెం: మాట్లాడుతున్న రేగా కాంతారావు

కరకగూడెం, నవంబర్ 19: **‘ప్రగతి’ గెలవాలి..! పల్లెలు మెరవాలి..!! ప్రజలు మురవాలి..!!!** – బీఆర్‌ఎస్ ఎన్నికల ప్రచారంలో ఇదే నినాదంగా మారింది. బీఆర్‌ఎస్ పాలనలో నియోజకవర్గం ఇప్పటివరకూ సాధించిన ప్రగతిని నాయకులు వివరిస్తున్నారు. మరోసారి బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తే.. పల్లెలు మరింతగా అభివృద్ధి సాధించి మెరుస్తాయని, దీన్ని చూస్తూ ప్రజలు మురిసిపోతారని చెబుతున్నారు. ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి రేగా కాంతారావు కూడా తన ప్రచారంలో ప్రధానంగా ఈ విషయాన్నే ప్రస్తావిస్తున్నారు. ఇన్నాళ్ల వరకూ తమ కళ్లెదుటే జరిగిన పల్లె ప్రగతిని చూస్తున్న ప్రజలు కూడా.. రేగా కాంతారావు, బీఆర్‌ఎస్ నాయకులు చెబుతున్న దానిని నమ్ముతున్నారు. మండలంలోని రఘునాథపాలెం, బర్లగూడెం, వెంకటాపురం, నర్సంపేట కాలనీ, రేగళ్ళ, మోతే, తాటిగూడెం, సీతారాంపురం, కుర్నవల్లి, భట్టుపల్లి, కన్నయ్యగూడెం గ్రామాల్లో ఆదివారం రేగా కాంతారావు విస్తృతంగా ప్రచారం చేశారు. ఇప్పటివరకూ ఎక్కడెక్కడ ఏమేం అభివృద్ధి జరిగిందో వివరించారు. బీఆర్‌ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తే ఏమేం చేస్తుందో చెప్పారు. పనిచేసే ప్రభుత్వానికే పట్టం కట్టాలని విజ్ఞప్తి చేశారు. సీఎం కేసీఆర్‌తోనే అభివృద్ధి సాధ్యమని అన్నారు. ‘‘తెలంగాణ ఏర్పాటుకు ముందు మన ఊరు ఎంత అధ్వానంగా ఉండేదో, ఇప్పుడు ఎంత అద్భుతంగా ఉందో పోల్చి చూడాలి’’ అని కోరారు. ఇంటింటికీ మంచినీరు, రైతులకు రైతుబంధు సాయం, ఇంటి పెద్దను కోల్పోయిన రైతు కుటుంబాలకు ఐదు లక్షల రూపాయల బీమా, దళితబంధు, సాగుకు నిరంతరాయంగా విద్యుత్, సాగునీటి రంగంలో సమూల మార్పులు.. ఇలా అనేక సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని, అభివృద్ధి పనులు జరిగాయని వివరించారు. పేదల జీవితాల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం వెలుగులు నింపిందని అన్నారు. బీఆర్‌ఎస్‌ను మళ్లీ గెలిపిస్తే.. రైతు బంధు కింద ఎకరానికి ప్రస్తుతం ఇస్తున్న రూ.10.000ను రూ16.000కు పెంచుతుందని, రూ.400కే గ్యాస్ ఇస్తుందని, మహిళలకు రూ.3,000, దివ్యాంగులకు రూ.6,000 ఇస్తుందని, తెల్ల రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం అందిస్తుందని, ప్రతి కుటుంబానికి ఐదు లక్షల రూపాయల బీమా కల్పిస్తుందని హామీ ఇచ్చారు. కారు గుర్తుకు ఓటేసి బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

### బీఆర్‌ఎస్‌లో చేరిక

బూర్గంపహాడ్, నవంబర్ 19: బీఆర్‌ఎస్ ఎన్నికల ప్రచారంలో భాగంగా భద్రాచలంలో రోడ్ షోకు వచ్చిన ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్‌ను సారపాక బీపీఎల్ పాఠశాల ప్రాంగణంలో బీజేపీ జిల్లా కార్యదర్శి బిజ్జం శ్రీకాంత్‌రెడ్డి కలిశారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి రేగా కాంతారావు ఆధ్వర్యంలో కేటీఆర్ సమక్షంలో గులాబీ కండువా కప్పుకున్నారు. మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత, జడ్పీటీసీ సభ్యురాలు కామిరెడ్డి శ్రీలత, ఏఎంసీ చైర్‌పర్సన్ ముత్యాలమ్మ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గోపిరెడ్డి రమణారెడ్డి, నాయకులు వల్లూరిపల్లి వంశీకృష్ణ, సానికొమ్ము శంకర్‌రెడ్డి, బోదెబోయిన బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆళ్ళపల్లి, నవంబర్ 19: గుండాల మండలం కాచనపల్లి పంచాయతీ జగ్గుతండాకు చెందిన న్యూడెమోక్రసీ పార్టీ గ్రామ అధ్యక్షుడు బావుసింగ్, ఉపాధ్యక్షుడు గుగులోత్ కాళు, నాయకులు మాలోత్ శ్రీను, ఫకీర్, సామియా, కిషన్, మానచంద్, ధరంసోత్ రాజేష్.. ఆదివారం బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి పార్టీ మండల నాయకుడు అటికం నాగేశ్వరావు గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు. నాయకులు తెల్ల బాబు, రవి తదితరులు పాల్గొన్నారు.

### విస్తృత ప్రచారం

మణుగూరు టౌన్, నవంబర్ 19: రేగా కాంతారావును గెలిపించాలని కోరుతూ బీఆర్‌ఎస్ నాయకులు ఆదివారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. భగత్‌సింగ్ నగర్ ఏరియాలో సింగరేణి రిటైర్డ్ కార్మికులతో పార్టీ నాయకుడు కత్తి రాము సమావేశమయ్యారు. నియోజకవర్గ సమగ్రాభివృద్ధి కోసం రేగా కాంతారావును గెలిపించాలని కోరారు. కాళీమాత టెంపుల్, గాంధీనగర్ ఏరియాల్లో నాయకులు ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. యూసఫ్ షరీఫ్, అడపా అప్పారావు, జన్నె స్వర్ణలత, రజిత, రజిని, వెంకటలక్ష్మి, శైలజ, సంతోషి తదితరులు పాల్గొన్నారు.

పినపాక, నవంబర్ 19: మండలంలోని అమరారం గ్రామంలో పోడు పట్టాలు పొందిన రైతులతో పార్టీ నాయకులు వట్టం రాంబాబు, గుమ్మడి గాంధీ ఆదివారం సమావేశమయ్యారు. పోటు పట్టాలు ఇప్పించిన, అభివృద్ధి పనులు చేసిన, సంక్షేమ ఫలాలు అందించిన రేగా కాంతారావును గెలిపించాలని కోరారు. సర్పంచులు మొగిలిపల్లి నర్సింహారావు, బాడిశ మహేష్, సుతారి సుశీల, కలివేటి సునీల్, గుమ్మడి అనంత, గొలుసుల నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు కాయం శేఖర్, నాయకులు గొంది నాగభూషణం, తోలెం శ్రీను, పాయం ప్రవీణ్ పాల్గొన్నారు.



మణుగూరు టౌన్: కాళీమాత టెంపుల్ ఏరియాలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు



మణుగూరు టౌన్: భగత్‌సింగ్ నగర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

# మంత్రి కేటీఆర్‌కు నేతల స్వాగతం



మంత్రి కేటీఆర్‌కు స్వాగతం పలుకుతున్న రేగా కాంతారావు

సారపాక, నవంబర్ 19: అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా భద్రాచలానికి బయలుదేరిన రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదివారం సారపాకలోని బీపీఎల్ స్కూల్ ఆవరణకు చేరుకున్నారు. అక్కడి హెలీప్యాడ్‌లో ఆయన హెలికాప్టర్ దిగిన వెంటనే ప్రభుత్వ విప్ రేగా కాంతారావు, మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత, ఎమ్మెల్సీ తాతా మధు, బీఆర్‌ఎస్ భద్రాచలం నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ తెల్లం వెంకట్రావు తదితరులు వెళ్లి ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి ఘన స్వాగతం పలికారు. హెలీకాప్టర్ దిగినవ వెంటనే మంత్రి కేటీఆర్ తన కాన్వాయ్ ద్వారా రోడ్డు మార్గాన భద్రాచలం వెళ్లారు. అక్కడ రోడ్ షో ముగిసిన అనంతరం మళ్లీ ఇక్కడికి చేరుకొని హెలీకాప్టర్ ద్వారా ఇల్లెందుకు పయనమయ్యారు. ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు కామిరెడ్డి శ్రీలత, బిక్కసాని శ్రీనివాసరావు, గోపిరెడ్డి రమణారెడ్డి, జలగం జగదీశ్, వల్లూరిపల్లి వంశీకృష్ణ, సానికొమ్ము శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.